**పల్లవి :**

ఏమిగలదిందు ఎంత కాలంబైన
పామరపు భోగమాపదవంటి దరయ

**చరణాలు :**

కొండవంటిది ఆస గోడవంటిది తగులు
బెండువంటిది లోని పెద్దతనము
పుండువంటిది మేను పోలించినను మేడి
పండువంటిది సరసభావమింతయును

కంచువంటిది మనసు, కలిమిగలదింతయును
మంచువంటిది, రతిభ్రమతవంటిది
మించువంటిది రూపు, మేలింతయును ముట్టు
పెంచువంటిది, దీని ప్రియమేమి బ్రాతి

ఆకవంటిది జన్మమడవివంటిది చింత
పాకువంటిది కర్మబంధమెల్ల
యేకటను తిరువేంకటేశు తలచిన కోర్కి
కాక సౌఖ్యములున్న గనివంటిదరయ

*(I-112)*